క్లుప్తంగా

ఐదేళ్ల పిల్లలకు టీకా వేయించాలి



ఏటూరునాగారం: ఐదేళ్ల లోపు చిన్నారులకు మిషన్ ఇంద్ర ధనుష్‌లో టీకాను వేయించాలని రొయ్యూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి సుమలత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం-1 సబ్ సెంటర్‌లో మిషన్ ఇంద్ర ధనుష్ టీకాలను 0-5 చిన్నారులకు చేశారు. వ్యాధులు రాకుండా వేయించుకోవాల్సి టీకాలను నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఏఎన్‌ఎం భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పరామర్శ

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండల కేంద్రం తోపాటు, తిరుమలగిరి, రామప్పగూడెంతండాలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన రొంటాల రాజయ్య, మష్క మధుకర్, బక్కతట్ల రజిత, రేసోజు జయప్రద, ఏదుల సమ్మయ్య, మాచర్ల వెంకటేష్, బానోతు నర్సమ్మ కుటుంబ సభ్యులను బుధవారం భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు పరామర్శించి, మృతుల చిత్ర పటాల వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య, మండల నాయకులు గూటోజు కిష్టయ్య, తదితరులు ఉన్నారు.

మొగుళ్లపల్లి: మండంలోని పలు గ్రామాల్లో మోరె హంసరెడ్డి, బండారి నిఖిల్, గడ్డం హరికృష్ణ, ఇప్పకాయల స్వామి, రేణుకుంట్ల రామమ్మ ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆమె వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చదువు రామచంద్రారెడ్డి, తదితరులు ఉన్నారు.

కస్తూర్బా స్కూల్ పనుల పరిశీలన

మొగుళ్లపల్లి: మండలంలోని కోర్కిశాల గ్రామంలోని కస్తూర్బా పాఠశాలలో నూతనంగా నిర్మించిన అకాడమీ బ్లాక్, స్టేజీని బుధవారం జెడ్పీటీసీ జోరుక సదయ్య పరిశీలించి, మాట్లాడారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అకాడమీ బ్లాక్‌ను, స్టేజిని శనివారం ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. వంట గదిని, పరిశీలించి నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. ఆయన వెంట సర్పంచ్‌ల ఫోరం మండల ఉపాధ్యక్షుడు దానబోయిన రాములు, పాశం స్వరూప, గుంటి లక్ష్మి, ఉప సర్పంచ్ మంద సంజీవరెడ్డి, పర్వతాలు, రవి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిట్యాల: ఓపెన్ స్కూల్‌లో 10వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చిట్యాల ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ బుర్ర సదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 సంవత్సరాలు నిండి, ఎలాంటి విద్యార్హత లేకున్నా 10వ తరగతిలో ప్రవేశం పొందవచ్చని, 10వ తరగతితో ఇంటర్‌లో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. ఆసక్తిగల వారు ఓపెన్ స్కూల్‌ను వినియోగించుకోవాలని, మరిన్ని వివరాలకు 94900 05525 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సమ్మె విరమణ

మల్హర్: పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెను తాత్కాలికంగా విరమించినట్లు కారోబార్ సంఘం మండల అధ్యక్షుడు కసుకుల శ్రీకాంత్ బుధవారం తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు సమ్మె విరమణ పత్రాన్ని అందించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నారా శేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ

భూపాలపల్లి రూరల్: వరద ముంపునకు గురైన మోరంచపల్లి గ్రామంలో హ్యూమన్ సొసైటీ ఇంటర్నేషనల్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా పశుగనాభివృద్ధి సంస్థ వరంగల్ సహకారంతో వరద బాధిత కుటుంబాలకు చెందిన పశువుల కోసం 80క్వింటాళ్ల దాణా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కమలబాయ్ వెంకన్న, గ్రామస్తులు నూకల నర్సింహారెడ్డి, గోపాలమిత్ర సూపర్ వైజర్ నూకల ప్రకాష్ రెడ్డి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పెంచాలి

భూపాలపల్లి అర్బన్: గృహలక్ష్మి దరఖాస్తుల గడువును పొడిగించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శేఖర్‌నాని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కులం, ఆదాయం, నివాసం ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా..ఇప్పటికీ సర్టిఫికెట్లు రావడం లేదన్నారు. రేషన్ కార్డు ప్రమాణికంగా లబ్ధిదారులకు ఎంపిక చేస్తున్నామంటున్న ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాలుగా రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో గృహలక్ష్మి పథకానికి దూరం చేస్తుందన్నారు. గడువు పొడిగించాలని డిమాండ్ చేశారు.



ఎస్ఎస్‌తాడ్వాయి: కొమురంభీం విగ్రహానికి పూలమాల వేస్తున్న అధికారులు



వాజేడు: గుమ్మడి దొడ్డిలో ..



వాజేడు: మండల కేంద్రంలో..



ఇప్పగూడెం గ్రామంలో..

కొమురంభీంను స్ఫూర్తిగా తీసుకోవాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: హక్కుల సాధన కోసం త్యాగాలు చేసిన కొమురంభీను స్ఫూర్తిగా తీసుకుని ఆదివాసీలు ముందుకెళ్లాలని తహసీల్దార్ తోట రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమానికి తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై ఓంకార్‌యాదవ్ ముఖ్యఅతిథులుగా హాజరై ఆదివాసీ ప్రజాప్రతినిధులతో కలిసి కొమురంభీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక సర్పంచ్ ఇర్ప సునీల్‌దొర ఆదివాసీ జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా తహసీల్దార్ రవీందర్ మాట్లాడుతూ.. ఆదివాసీలు మహోన్నీయులు ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. ఎస్సై ఒంకార్‌యాదవ్ మాట్లాడుతూ ఆదివాసీ ప్రపంచ దినోత్సవ వేడుకలను నిర్వహించి కొమురంభీం త్యాగాలను గుర్తు చేసుకోవడం చాలా గొప్ప విషయమన్నారు. ఆదివాసీలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు చాలా విశిష్టమైనవని అన్నారు. ఈ కార్యక్రమంలో కామారం సర్పంచ్‌లు రేగ కల్యాణి, నరసింహస్వామి, ఆదివాసీ నాయకులు కొర్నెబెల్లి విరేశం, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు మోహన్‌రావు, పంచాయతీ కార్యదర్శి రేగ రాజశేఖర్, సూర్యనారాయణ, రమేష్, వెంకన్న, వెంకటేశ్, సీతారాములు పాల్గొన్నారు.

మేడారంలో..

మేడారంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థినులు జరుపుకున్నారు. కొమురంభీం విగ్రహానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదివాసీల హక్కులు, చట్టాల కోసం కొమురంభీం చేసిన పోరాట త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సరోజన, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, తేజనాయక్, సుశీల, సుమలత, దేవేంద్ర, సరస్వతి, ప్రశాంతి, అశ్విని, సృజన, రమణ, వెంకటలక్ష్మీ, పార్వతి, లక్ష్మీ, సృజన పాల్గొన్నారు.

ఊరూరా ఆదివాసీ దినోత్సవం

వాజేడు: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని బుధవారం ఆదివాసీలు మండల వ్యాప్తంగా గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించారు. వాడ వాడలా ఆదివాసీ జెండాలను ఎగుర వేసి నినాదాలు చేశారు. మండల కేంద్రంలో ఆదివాసీలు, వివిధ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో జెండాను ఎగుర వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏజెన్సీలో చట్టాలను పక్కాగా అమలు జరుపాలన్నారు. 1/70, పెసా చట్టాలను అమలు చెయ్యడంతో పాటు ఆదివాసీలకు రక్షణ కల్పించాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గం చూపాలన్నారు. ఏజెన్సీలోని ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలను అధికారులు గౌరవించాలని సూచించారు. నాగారం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆదినారాయణ మండల కేంద్రంలో ఆదివాసీ జెండాను ఎగుర వేశారు. బొల్లారం, శ్రీరామ్ నగర్, గుమ్మడి దొడ్డి, ఘణపురం, ఇప్పగూడెం గ్రామాల్లో ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసీలు కన్నుల పండుగలా నిర్వహించారు. కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడంతో పాటు ఆయన స్ఫూర్తిని కొనియాడారు.

ఆదివాసీ సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో..

వెంకటాపురం(కె): మండలంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను బుధవారం ఆదివాసీ సంఘాలు, కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని కోమరంభీం విగ్రహం వద్ద తహసీల్దార్ కార్యాయలం సమీపంలో జెండాలను ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో జెండాలను ఆవిష్కరించారు. అనంతరం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పాత్రాపురం, ఎదిర, దానవాయిపేట, ఆలుబాక గ్రామాల్లో ఆదివాసీ యూత్ ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అద్దూరి బాబు, ఎంపీపీ చెరుకూరి సతీష్ కుమార్, సర్పంచ్‌లు అట్టం సత్యనారాయణ, కోర్సా నర్సింహామూర్తి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరం సంతోష్, ఆదివాసీ సంఘాల నాయకులు పూనెం సాయి, చింత సోమరాజు, నాగరాజు, సతీష్, ఉయిక శంకర్, పూనెం రామచందర్, కంతి వెంకటకృష్ణ, తదితరులు ఉన్నారు.



వెంకటాపురం(కె): కొమురం భీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆదివాసీలు

కన్నాయిగూడెం: మండల కేంద్రంలోని కొమురం భీం విగ్రహ ప్రాంగణంలో మండల అధ్యక్షుడు గుండ్ల పాపారావు అధ్యక్షతన ప్రపంచ ఆదివాసీల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడెం బాబు హాజరై ఆదివాసీ జెండాను ఎగరవేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఆలెం ప్రభాకర్, సూర్యనారాయణ, పీరీల శ్రీనివాస్, కేశవరావు, యాలం మురళి, నాగేష్, ఆలం రాంబాబు, బొగ్గం బాబు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

మంగపేట: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం వేడుకలను ఆదివాసీ ప్రజా సంఘాలు, ఉద్యోగ, విద్యార్థి సంఘాల నాయకుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని కొమరంభీం విగ్రహం వద్ద , గంపోనిగూడెం, మల్లూరు, తిమ్మాపురంలో తుడుం దెబ్బ, గిరిజన ఉద్యోగుల సంక్షేమ, సాంస్కృతిక సంఘం, గిరిజన ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు, పీసా కమిటీల ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కుమురంభీం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మంగపేటలో ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమ, సాంస్కృతిక సంఘం మండల అధ్యక్షుడు కృష్ణమూర్తి, మల్లూరుమామిడిగూడెంలో తుడుందెబ్బ నాయకుడు నల్లెబోయిన లక్ష్మణ్‌రావు తుడుందెబ్బ జెండాను ఆవిష్కరించి జాతికోసం, ఆదివాసీ హక్కుల సాధనకోం పోరాడిన గిరిజన జాతిపిత కొమరంభీం సేవలను కొనియాడారు. కొమరంభీం ఆశయాల సాధనకోం ప్రతి ఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల సంరక్షణ, హక్కులు, సంస్కృతి సంప్రదయాల పరిరక్షణ తదితర అంశాలను ఐక్యరాజ్యసమితి 1982 ఆగస్టు 09న ఆమోదించింది. నాటి నుంచి ఆదివాసీల అస్థిత్వాన్ని పరిరక్షించుకోవడంతోపాటు ప్రతి ఏటా ఆగస్టు 09న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆదివాసీ తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కబ్బాక శ్రావణ్‌కుమార్, మన్యసీమ పరిరక్షణసమితి డోలిదెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు గొప్పవీరయ్య, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గొప్ప సమ్మారావు, తల్లడి నాగేశ్వర్‌రావు, మద్దెల అంజయ్య, జబ్బ రవి, కొమరం సర్సాయ్య, పాదెం రవీందర్, మల్లిఖార్జున్, గుండం పురుశొత్తం, కొరెం శ్రీనివాస్, మడి మల్లయ్య, తోలెం నర్సింహారావు, చాద మల్లయ్య, యానయ్య, తోలెం శ్రీనివాస్, తాటి విజయబాబు పాల్గొన్నారు.



వెంకటాపురం(కె): నృత్యాలు చేస్తున్న ఆదివాసీ యువతులు



కన్నాయిగూడెం: పాల్గొన్న ఆదివాసీ నాయకులు



మంగపేట: మండల కేంద్రంలో..

వరద బాధితులకు చేయూత



దుస్తులు పంపిణీ చేస్తున్న నాగజ్యోతి

ఎస్ఎస్‌తాడ్వాయి: వరద బాధితులకు దాతలు చేయూతనిచ్చి అందుకోవడం అభినందనీయమని జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. సూర్యపేట జిల్లాలోని సాయిసిరి సూపర్ మార్కెట్ ఆధ్వర్యంలో మండలంలోని కాల్వపల్లి, ఊరట్టం సమీపంలోని గొత్తికోయ గూడెంలోని వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, దోమతెరలు, దుస్తులు, దుప్పట్లు, పాదరక్షలను జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ.. వరద బాధితులకు సాయం అందిస్తున్న దాతల సేవలు మరువలేనివన్నారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న నిత్యావసరాలను వరద బాధితులు వినియోగించుకోవాలని తెలిపారు. కష్టాల్లో ఉన్న వరద బాధితులకు అండగా నిలుస్తున్న దాతలను నాగజ్యోతి కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, సర్పంచ్ గొంది శ్రీధర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తరగతులు నిర్వహించాలని విద్యార్థుల ఆందోళన



కాటారం: కాటారం మండల కేంద్రంలోని బాబు పారామెడికల్ కళాశాలలో సరైన వసతులు లేకపోవడంతో పాటు తరగుతులు సక్రమంగా నిర్వహించడం లేదని ఆరోపిస్తూ బుధవారం కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు కాటారం- మంథని రహదారిపై కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కళాశాలలో అడ్మిషన్ పొందిన విద్యార్థుల గూర్చి కళాశాల యజమాన్యం పట్టించుకోవడం లేదని తరగతులు నిర్వహించకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. యజమాన్యాన్ని అడిగిన స్పందించడం లేదని విద్యార్థులు పేర్కొన్నారు. విద్యార్థుల ఆందోళనకు ఎస్ఎఫ్ఐ నాయకులు మద్దతు తెలిపారు. అటువైపుగా వెళ్తున్న పీపీసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి, ఆందోళన చేస్తున్న సమాచారం అందుకున్న ట్రైనీ ఎస్సై ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకొని విద్యార్థులతో మాట్లాడారు. కళాశాల యజమాన్యంతో మాట్లాడి తరగతులు సరిగా నిర్వహించేలా చూస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. ఈ విషయమై కళాశాల కరస్పాండెంట్ తాటి శ్రీనివాస్‌ను వివరణ కోరగా కళాశాలను నూతన భవనంలోకి మార్చే ప్రక్రియలో తరగతుల నిర్వాహణ కొంత ఆలస్యం జరిగిందన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె విరమణ

ఏటూరునాగారం: గత నెల 6 నుంచి చేపట్టిన పంచాయతీ కార్మికుల సమ్మెను బుధవారం విరమించినట్లు పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు ఇర్సవడ్ల రాజు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో జేఏసీ నాయకులతో మంత్రి దయాకర్‌రావు చర్చించి కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకే రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు సమ్మెను విరమించినట్లు రాజు తెలిపారు. తమ సమ్మెకు సంఘీభావం తెలిపిన జిల్లా ప్రజాప్రతినిధులు, కుల సంఘాలు, పోలీసు, సర్పంచ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సమ్మె విరమించిన పంచాయతీ కార్మికులు

వెంకటాపురం(కె): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 34 రోజులుగా చేపటిన సమ్మెను పంచాయతీ కార్మికులు బుధవారం విరమించారు.



ఎంపీడీఓకు హామీ పత్రం ఇస్తున్న కార్మికులు

ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించినట్లు తెలిపారు. బుధవారం సమ్మె విరమించి విధుల్లో చేరుతున్నట్లు ఎంపీడీఓ అద్దూరి బాబుకు హామీ పత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు రంజిత్, లక్ష్మణరావు, తాటి శ్రీను, సమ్మయ్య, నాగేశ్వరావు తదితరులు ఉన్నారు.

'మోరంచపల్లి' బాధితులకు సాయం అందించాలి

- ధర్మ సమాజ పార్టీ ఆధ్వర్యంలో ప్రారంభమైన రిలే నిరాహార దీక్ష

భూపాలపల్లి రూరల్: మోరంచపల్లి వరద బాధితులకు ప్రభుత్వం తక్షణం రూ.లక్ష సాయం అందజేసి ఆదుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరి రవీందర్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మోరంచపల్లి వరద బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పార్టీ నాయకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలో భూపాలపల్లి జిల్లా ప్రచార కమిటీ నాయకులు కూర్చోగా ముఖ్య అతిథులుగా బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భీమనాథుని సత్యనారాయణ, గొర్ల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాకోటి ఓదెలు, ఐఎఫ్‌టీయూ నాయకులు బుర్రి



దీక్ష చేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

కుమారస్వామి దీక్షలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మేకల సుమన్ రాష్ట్ర నాయకులు సాయిబాబా, రాజేష్, రత్నాకర్, రాజు పూలమాల రూప పాల్గొన్నారు. టీపీపీపీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణ రావు రిలే దీక్షలకు మద్దతు తెలిపారు. ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు రమేష్, రవీందర్, రవి, రాజ్‌కుమార్, రాజేష్, రత్నాకర్, ప్రవీణ్, అశోక్, జితేందర్, శ్యామ్, నరసింహ, ఓంకార్, రాజు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో 'మేరా మిట్టి- మేరా దేశ్'

భూపాలపల్లి రూరల్: మండలంలోని కమలాపూర్ గ్రామంలో 75 సంవత్సరాల స్వాతంత్ర్యంలో భాగంగా బుధవారం ఎన్‌వైకే 58 బెటాలియన్ సీఆర్‌పీఎఫ్, కాకతీయ యూనివర్సిటీ, పంచాయతీ రాజ్ అండ్ డెవలప్‌మెంట్, కేంద్ర సమాచార, ప్రసార శాఖ సంయుక్తంగా 'మేరా మిట్టి- మేరా దేశ్' కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా మనం ఉండే మట్టిని తలుచుకుంటూ పదవీవిరమణ పొందిన జవాన్లు, వారి కుటుంబ సభ్యులను స్మరించుకున్నారు. అనంతరం మొక్కలు నాటి, మాతృభూమి కోసం గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం భారత సైన్యంలో సేవలందించి వీరమరణం పొందిన కమలాపూర్ గ్రామ నివాసి అజ్మీరా నరహన్ సతీమణి విమలను సన్మానించారు.



మొక్కలు నాటుతున్న జవాన్‌లు, విద్యార్థులు

ఈ కార్యక్రమంలో నెహ్రూ కేంద్ర యూత్ ఆఫీసర్ అన్వేష్, కాకతీయ యూనివర్సిటీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, సీఆర్‌పీఎఫ్ సబ్ ఇన్స్‌పెక్టర్ బూరాలాల్ మీనా, కేంద్ర సమాచార ప్రసార శాఖ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ శ్రీధర్, భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సంధ్యారాణి, సర్పంచ్ పాల్గొన్నారు.

కొమురం భీం ఆశయసాధనకు కృషి చేయాలి

ఏటూరునాగారం: ఆదివాసీ హక్కుల కోసం జీవితాన్ని త్యాగం చేసిన కొమురం భీం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలని తెలంగాణ ప్రోగ్రెస్సివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె నాగరాజు అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బోజు రాజేంద్ర చారి ఆధ్వర్యంలో కొమురం భీమ్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం పల్లె నాగరాజు మాట్లాడుతూ ఆదివాసీల జీవనశైలి వారి అలవాట్లు, సంప్రదాయాలు అన్నీ ఏంతో విశిష్టమైనవని అన్నారు. ఆగస్టు 9వ తేదీన ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకోవాలని 1993లో ఐక్య రాజ్య సమితి తీర్మానం చేసింది అన్నారు. ఈ తీర్మానం అమలుతో అడవులపై హక్కులు ఆదివాసులకే ఉన్నాయని 2010జూలై 14న జాతీయ అభివృద్ధి మండలి సమావేశంలో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రకటించారని గుర్తు చేశారు. అయినా ఇప్పటికి ఏజెన్సీ ప్రాంతంలో కొంతమంది అధికారులు ఆదివాసులపై దాడులు చేయడం బాధాకరం అన్నారు. ప్రతి ఆదివాసీ బిడ్డ తమ అభివద్ధికి కొమురం భీమ్ ఇచ్చిన జల్ -జగిల్ -జమీన్ నినాదంతో ముందుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దైనంపెల్లి రాజయ్య, జట్టి సుభాష్, ఉట్నూర్ రాంబాబు, కోడూరు సమ్మయ్య, మామిడి తిరుపతి, శశిధర్, రాజు కుమార్ పాల్గొన్నారు.



పూలమాల వేస్తున్న నాయకులు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించొద్దు



మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వర్

ములుగు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని ములుగు ఎస్సై వెంకటేశ్వర్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్సై మాట్లాడారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థలో భాగంగా ఎలాంటి ఇబ్బందులు ఉన్నా బాధితులు నేరుగా సంప్రదించాలని తెలిపారు. ఏ విషయమైనా ముందుగా సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. మీడియా సమాచారం అందించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రెండో ఎస్సై లక్ష్మారెడ్డి, మూడో ఎస్సై కన్నారావు ఉన్నారు.

108 వాహన సేవలు వినియోగించుకోవాలి



వాహనాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ మౌనిక

కన్నాయిగూడెం: మండలానికి నూతనంగా ప్రభుత్వం విడుదల చేసిన 108 వాహన సేవలను ప్రజలు వినియోగించుకోవాలని డాక్టర్ మౌనిక అన్నారు. గత కొంత కాలంగా మండలానికి కేటాయించిన 108 వాహనం పాడై పోవడంతో ఇతర మండలం వాహనాలతో సేవలు అందుకున్న ప్రజలకు అత్యవసర సేవలు మరింత చేరువయ్యాయి. మండలానికి ప్రభుత్వం నూతన వాహనాన్నా కేటాయించడంతో వాహనాన్ని డాక్టర్ మౌనిక బుధవారం ప్రారంభించి, మాట్లాడారు. ప్రజలు అత్యవసర సేవలను వినియోగించుకోవాలని కోరారు. అత్యవసరమైనప్పుడు 108 నంబర్‌కు ఫోన్ చేసి సేవలను పొందాలని సూచించారు. వీరివెంట పైలెట్స్ రవీందర్, సతీష్, ఈఎంటీ విజేందర్ ఉన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

మొగుళ్లపల్లి: స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ పథకం కింద మొట్లపల్లిలో జరుగుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత అన్నారు. బుధవారం మొట్లపల్లి గ్రామంలో పురోగతిలో ఉన్న ఇంటింటికి ఇంకుడుగుంత, మరుగుదొడ్ల నిర్మాణం పనులను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, ఐకేపీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరహరి పద్మవెంకటరెడ్డి, మండల ప్రత్యేక అధికారి సునిత, ఎంపీడీఓ కృష్ణవేణి, ఎంపీఓ వీరస్వామి, ఇన్‌చార్జ్ ఏపీఓ రాము, ఏపీఏ రవివర్మ, టెక్నీకల్ అసిస్టెంట్స్ మహేందర్, మానస సీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తుదారుల నిరీక్షణ



మీసేవా కేంద్రాల వద్ద నిరీక్షిస్తున్న ప్రజలు

మంగపేట: ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 10వరకు గడువు విధించిన విషయం తెలిసిందే. అయితే దరఖాస్తు చేసుకునేందుకు కావాల్సిన విధివిధానాలపై స్పష్టమై ప్రకటన లేకపోవడంతో ప్రజలు కాస్త అయోమయానికి గురవుతున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు వివరాలు తెలుసుకుని దరఖాస్తు చేసుకునేందుకు మీసేవ కేంద్రాల వద్ద పడిగాపులు గాస్తున్నారు.